నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 27 మే 2025 | SIDDIPET

సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని వ్యవసాయ కార్యాలయం వద్ద గుమిగూడిన రైతులు

పట్టు ఉత్పత్తిలో జిల్లాకు ప్రథమ స్థానం

మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్

జగదేవ్‌పూర్, మే 26: రాష్ట్రంలోనే పట్టు ఉత్పత్తిలో సిద్దిపేట జిల్లా ప్రథమస్థానంలో ఉందని ఉమ్మడి మెదక్ జిల్లా హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాలలో రైతులకు ఉద్యానవన పంటల సాగు గురించి ఆయన వివరించారు. సిద్దిపేట జిల్లాలో 403 కుటుంబాలకు మల్బరీ సాగు చేపట్టి నెలకు రూ.50వేల నుంచి లక్ష వరకు ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. 2014 కంటే ముందు జిల్లాలో 30 ఎకరాల్లో మాత్రమే మల్బరీ సాగు ఉండేదని, ప్రస్తుతం 1127 ఎకరాల్లో మల్బరీ తోటలను రైతులు సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఎకరం వరి సాగుకు కావాల్సిన నీటితో మూడెకరాల్లో మల్బరీ తోటలు సాగు చేయొచ్చన్నారు. పట్టు పరిశ్రమతో జిల్లాలో చిన్న,సన్నకారు రైతులకు ఉపాధి లభిస్తున్నట్లు తెలిపారు.

జీలుగ విత్తనాలకు రైతుల తిప్పలు

- విత్తనాల కోసం పాస్‌బుక్కులతో క్యూలైన్
- జోగిపేటలో విత్తనాల పంపిణీ మొదటిరోజే ఇబ్బందులు
- అధిక ధరలకు విత్తనాల పంపిణీపై రైతుల ఆగ్రహం

జోగిపేటలో క్యూలో పెట్టిన పాస్‌బుక్కులు

అందోల్, మే 26: జీలుగ విత్తనాల కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వారం రోజుల్లో వానకాలం సీజన్ ప్రారంభం కానుండగా ఆలస్యంగా విత్తనాల పంపిణీకి అధికారులు శ్రీకారం చుట్టారు. విత్తనాల కోసం కొన్నేండ్లుగా కనబడకుండా పోయిన పాస్‌బుక్కుల క్యూలైన్లు మళ్లీ దర్శనమిస్తున్నాయి. సోమవారం సంగారెడ్డి జిల్లా జోగిపేట వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీకి వ్యవసాయ అధికారులు పర్మిట్లు ఇచ్చేందుకు సిద్ధం కాగా, భారీగా రైతులు తరలి వచ్చారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏర్పడడంతో రైతులు పాస్‌బుక్కులను క్యూలో పెట్టి నిరీక్షించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తమకు సరిపోను విత్తనాలు ప్రభుత్వం అందుబాటులో ఉంచడం లేదన్నారు. తొలిరోజే తమకు సరిపోను విత్తనాలు అందలేదన్నారు. విత్తనాలు సైతం అధిక ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. గతేడాది ఒక్కో బస్తా రూ. 1140కి ఇచ్చారని ..ఇప్పుడూ రూ. 2137.50 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీహరి మాట్లాడుతూ.. రైతులకు సరిపోను విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులందరూ ఒకేసారి రావడంతో ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. సోమవారం 300 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని, రైతులందరికీ అందజేస్తామన్నారు.

సబ్సిడీ ఇవ్వడం లేదు...

విత్తనాల కోసం ఉదయం నుంచి కార్యాలయం వద్దకు వచ్చి పాస్‌బుక్కులు క్యూలో పెట్టి నిలబడ్డాం. అయినా విత్తనాలు దొరకడం కష్టంగా మారింది. ఒక్క ఎకరాకు ఒక బ్యాగు ఇచ్చే అధికారులు 2.5 ఎకరాలకు ఒక బ్యాగు ఇస్తామని చెప్పారు. అది కూడా సబ్సిడీ ఇవ్వడంలేదు. గతేడాది రూ. 1140కి ఇస్తే ఇప్పుడూ రూ. 2137.50 ఒక బ్యాగు ఇస్తున్నారు. ఇంకా సబ్సిడీ ఎక్కడ ఇచ్చినట్లు. ప్రభుత్వం రైతులను ఎక్కడ ఆదుకున్నట్లు. ఓ పక్క వడ్లు వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతుంటే ..మరో వైపు విత్తనాల పంపిణీలో ఇబ్బందులు పడుతున్నాం.

-జీరప్ప, రైతు. ఎర్రారం

కొనసా..గుతున్న కొనుగోళ్లు

యాసంగిలో రైతులు పండించిన ధాన్యం విక్రయానికి తిప్పలు తప్పడం లేదు. వారం రోజుల్లో వానకాలం ప్రారంభంకానున్నది. దీంతో పాటు అకాల వర్షాలు కురుస్తున్నాయి. అయినా ధాన్యం కొనుగోళ్లు ముగియడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎక్కడ చూసినా కల్లాల్లో ధాన్యం కుప్పలు దర్శనమిస్తున్నాయి. రైతులు కుటుంబ సమేతంగా ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు వ్యవసాయ పనులు మొదలవుతుండడంతో కొంతమంది రైతులు పొలాల దున్నకాల్లో బిజీగా మారారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని వెంకటరావుపేటలో సోమవారం 'నమస్తే తెలంగాణ'కు కనిపించిన దృశ్యాలు ఇవి.

-నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫోటోగ్రాఫర్ సిద్దిపేట, మే 26

తొగుటలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

తొగుటలో ధాన్యం ఆరబెడుతున్న రైతు కుటుంబం

సిద్దిపేట జిల్లా వెంకట్రావుపేట్‌లో కల్లాల్లో ధాన్యం

వెంకట్రావుపేటలో కొనుగోలు కేంద్రంలో వడ్లు ఆరబెడుతున్న రైతులు

కాంగ్రెస్ పాలనలో అరిగోస

- ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు
- ఎవరి కడుపు నింపడానికి అందాలు పోటీలు
- విత్తనాలు, చేప పిల్లల పంపిణీలో ప్రభుత్వం విఫలం
- కమీషన్లు, ఢిల్లీకి కప్పం కట్టే పనిలో సీఎం రేవంత్ నిమగ్నం
- ప్రజలే ఈ సర్కారు బుద్ధి చెబుతారు
- ముదిరాజ్‌ల సంక్షేమానికి బీఆర్ఎస్ సర్కారు కృషి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- హామీలు నెరవేర్చాల్సిందే
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండాప్రకాశ్

సిద్దిపేట జిల్లా పాలమాకులలో విగ్రహాలను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు, బండా ప్రకాశ్

నంగునూరు, మే 26 : కాంగ్రెస్ పాలనలో ఆరుగ్యారెంటీలు, హామీలు అటకెక్కాయని, ఏ ఒక్కవర్గం సంతోషంగా లేదని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అందాల పోటీల నిర్వహణకు పైసలు ఉంటాయి కానీ, విత్తనాలు, చేప పిల్లలు ఇవ్వడానికి పైసలు లేవా అని.. ఏ వర్గం ప్రజల కడుపు నింపడానికి అందాల పోటీలు నిర్వహిస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని పాలమాకుల గ్రామంలో పండుగ సాయన్న, కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ విగ్రహాలను శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌తో కలిసి హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. నంగునూరు మండలంలో మొట్ట మొదటి సారిగా పండుగ సాయన్న, కొరివి కృష్ణస్వామి విగ్రహాలు ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విగ్రహాలను ఆవిష్కరించడం ఎంత ముఖ్యమో, వారిని జీవితంలో ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లడం అంతే ముఖ్యమన్నారు. హైదరాబాద్ తొలి మేయర్‌గా, ముదిరాజ్ సమాజానికి కొరివి కృష్ణ స్వామి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. పండుగ సాయన్న తన ప్రాణాలను లెక్క చేయకుండా పేదల కోసం పోరాడారని, చివరికి ప్రాణాలను వదిలి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచినట్లు తెలిపారు. కానిస్టేబుల్ కిష్టయ్య తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసి చరిత్ర పుటల్లో నిలిచిపోయారన్నారు. కిష్టయ్య కుటుంబాన్ని కేసీఆర్ ఆదుకున్నారని, ఆయన కూతురిని డాక్టర్ చదివించడమే కాకుండా ఇప్పుడు పీజీ చదివిస్తున్నట్లు తెలిపారు.

ముదిరాజ్‌లపై కాంగ్రెస్ సర్కారు వివక్ష...

మిషన్ కాకతీయ ద్వారా ప్రాజెక్టులను చెరువులకు అనుసంధానం చేసి, కొత్త ప్రాజెక్టులు నిర్మించి చెరువులో నీళ్లు నింపి ముదిరాజులకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేయూత ఇచ్చినట్లు హరీశ్‌రావు తెలిపారు. కాలమైనా కాకపోయినా కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో చెరువులను నింపి నిండుకుండలా చేశామని, దీంతో గ్రామాల్లో ముదిరాజులకు ఉపాధి దొరికిందన్నారు. సమైక్య రాష్ట్రంలో చెరువులను, ప్రాజెక్ట్‌లను పట్టించుకోలేదని, మన నీళ్లు మనకు దక్కనీయలేదన్నారు. కృష్ణా, గోదావరిలో మన నీళ్ల వాటా మనకు దక్కాలని పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తిచేసినట్లు తెలిపారు. కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్ట్‌లను పూర్తి చేశామన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.1000 కోట్లు ఖర్చు చేసి ముదిరాజులకు బండ్లు, ఆటోలు, పడవలు, వలల కోసం ఆర్థిక సాయం అందించినట్లు గుర్తుచేశారు. ఏటా రూ.120 కోట్లు ఖర్చు చేసి ఉచితంగా చేప పిల్లలు, రొయ్యల్ని చెరువుల్లో, ప్రాజెక్టుల్లో వదిలింది బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సగం జిల్లాల్లోని చెరువుల్లో ఇప్పటి వరకు చేప పిల్లలు పోయలేదన్నారు. జూన్ నెల వచ్చినా ఇప్పటికీ ప్రభుత్వం చేప పిల్లల టెండర్లు పిలవలేదని, దీన్ని బట్టి ముదిరాజులపై ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతున్నటుల హరీశ్‌రావు పేర్కొన్నారు. చెరువులో చేప పిల్లల్ని వదలకపోతే ప్రభుత్వాన్ని వదిలిపెట్టమన్నారు. ముదిరాజుల, మత్స్యకారుల ఉపాధి దెబ్బతీయకూడదని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. విత్తనాలు, చేప పిల్లలు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. హెచ్ఎండబ్ల్యూఎస్‌లో రూ. 10 వేల కోట్లతో టెండర్లు పిలిచారని, జీహెచ్ఎంసీలో రూ.7 వేల కోట్లతో టెండర్లు పిలిచారని, హెచ్ఎండీఏలో రూ.20 కోట్లతో టెండర్లు పిలిచారని, ఫ్యూచర్ సిటీలో రేవంత్ రెడ్డి భూములు కొన్నాడని, ఆరు లేన్ల రోడ్డు వేసుకోవడానికి రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. వీటన్నింటికీ డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయో సమాధానం చెప్పాలన్నారు. కమీషన్‌ల కోసం, జేబులు నింపుకోవడానికి, ఢిల్లీకి కప్పం కట్టడానికి రూ.లక్ష కోట్ల టెండర్లను కాంగ్రెస్ ప్రభుత్వం పిలుస్తున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో పెద్దమ్మ గుడి లేని ఊరే ఉండదని, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ లేని ఊరే లేదన్నారు. సిద్దిపేటలో రూ.10 కోట్లతో ఏసీ ఫంక్షన్ హాల్ నిర్మించామన్నారు. పాలమాకులలో ముదిరాజులు, యువత ముందుకు వచ్చి పండుగ సాయన్న, కొరివి కృష్ణ స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసినందుకు హరీశ్‌రావు అభినందనలు తెలిపారు.

పాలమాకులలో జెండాను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు, బండా ప్రకాశ్

హామీలు నెరవేర్చాలి : బండా ప్రకాశ్

మాట్లాడుతున్న బండా ప్రకాశ్

కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే యుద్ధానికి సిద్ధమని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రముఖుల విగ్రహాలను పెట్టుకొని స్మరించుకుంటున్నట్లు తెలిపారు. కృష్ణ స్వామి విగ్రహాలను హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలో నలుమూలల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన చరిత్ర చాలా గొప్పదని, బలహీన వర్గాల కోసం గ్రంథాల్ని రచించారన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత హైదరాబాద్‌కు మొదటి మేయర్‌గా కృష్ణస్వామి పనిచేశారని, ఆయన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. పండుగ సాయన్న భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశాడని, పెద్దోన్ని కొట్టు పేదలకు పెట్టాలనే నినాదంతో ఆయన పని చేశాడన్నారు. సాయన్న సమాజ శ్రేయస్సు కోసం పని చేశాడన్నారు. కేసీఆర్ సీఎం ఉన్నపుడే కేవల్ కిషన్ జాతరను అధికారికంగా ప్రకటించి నిధులు విడుదల చేసినట్లు గుర్తుచేశారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు అయినా పేద ముదిరాజులకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. కేసీఆర్ చేయించిన సమగ్ర కుటుంబ సర్వే వల్ల ముదిరాజులు అధిక సంఖ్యలో ఉన్నామని తెలిసిందన్నారు. కేసీఆర్ హయాంలోనే మత్స్యకారులకు వాహనాలు పంపిణీ చేశారని తెలిపారు.

దేశానికి దారిచూపిన మహనీయుడు అంబేద్కర్


చెర్లఅంకిరెడ్డిపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తన్నీరు హరీశ్‌రావు

మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూర్, మే 26: దేశానికి దారిచూపిన గొప్ప మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండలం చెర్లఅంకిరెడ్డిపల్లిలో సోమవారం అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చదివిన చదువుకు లండన్, అమెరికాలో పెద్దపెద్ద ఉద్యోగాలు వచ్చేవని, ఆయన తన చదువును దేశం కోసం ఉపయోగించాడని, రాజ్యాంగం రచించాడని అన్నారు. బోధించు, సమీకరించు, పోరాడు అనే గొప్ప సూత్రాన్ని అంబేద్కర్ చెప్పినట్లు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను పాటించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. భవిష్యత్‌ను ఊహించి రాజ్యాంగం రచించారని, మహిళలకు, పురుషులకు సమాన అవకాశాలు ఇచ్చారని గుర్తుచేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ రాష్ట్రం సాకారమైనట్లు తెలిపారు. కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు అసెంబ్లీ తీర్మానాలు అవసరం లేదని, ఆర్టికల్- 3 ఉంటే చాలని ఆనాడే అంబేద్కర్ రాశారన్నారు. అందుకే అంబేద్కర్ అందరివాడని.. కానీ, తెలంగాణకు మరింత దగ్గరి వాడని హరీశ్‌రావు అన్నారు.

సచివాలయానికి అంబేద్కర్ పేరు...

దేశంలో ఏ సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టలేదని, తెలంగాణలో అత్యద్భుతంగా కట్టిన సచివాలయానికి అంబేద్కర్ పేరు కేసీఆర్ పెట్టినట్లు తెలిపారు. హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించుకొని గౌరవిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ ఓవర్ సీస్ స్కాలర్‌షిప్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సమాజంలో కుల అసమానతలు పోవాలంటే విద్య అనేది చాలా అవసరం అని, అందరికీ విద్య అందుబాటులో ఉండాలని గురుకులాలను కేసీఆర్ ఏర్పాటు చేసినట్లు హరీశ్‌రావు తెలిపారు. మనం పిల్లలకు ఇచ్చే ఆస్తి ఒక్కటే విద్య అని, విద్య అనేది ఉద్యోగం కోసమే కాదని, మనిషికి మంచి ఆలోచన ఇస్తుందన్నారు. విలువలతో కూడిన జీవనాన్ని ఇస్తుందన్నారు. మన హక్కులను పొందడానికి ఉపయోగపడుతుందని, మగ, ఆడ అనే తేడాలే కుండా అందరికీ సమానమైన విద్యను అందించాలని తెలిపారు. ఈ రోజుల్లో ఆడపిల్లలు అద్భుతాలు సృష్టిస్తున్నారని, వారికి విద్య అందించాలని కోరారు. ఏటా నూతన సంవత్సరం వేడుకలు తాను కుటుంబంతో జరుపుకోనని, ఎస్సీ ఎస్టీ హాస్టల్‌లో జరుపుకొంటానని తెలిపారు. ఆడపిల్లలు డిగ్రీ చదవాలని కేసీఆర్ ఆరోజే 75 రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంటరానితనం లాంటి ఏదైనా సమస్యలు ఉంటే తనకు ఒక్క మెసేజ్ చేయాలని, ఎవరైనా కఠిన చర్యలు తీసుకుంటానని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు, గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, మాజీ సర్పంచ్ స్వర్ణలత శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పరశురాములు, నాయకులు పోచబోయే శ్రీహరి యాదవ్, కొండం రవీందర్ రెడ్డి మేడికాయల వెంకటేశం, పాపయ్య, జంగిటి శ్రీనివాస్, డిబి ఎఫ్ శంకర్, బాబురావు, మెట్ల శంకర్, ఉమేశ్ చంద్ర, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

కళలపై ఆసక్తి పెరగడం శుభపరిణామం

స్పిక్ మాకే పదో అంతర్జాతీయ సమ్మేళనంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఐఐటీహెచ్‌లో నిర్వహించిన స్పిక్‌మాకే సమ్మేళనంలో మాట్లాడుతున్న గవర్నర్

సంగారెడ్డి,మే 26(నమస్తే తెలంగాణ) : యువతలో భారతీయ కళల పై ఆసక్తి పెరుగుతుండడం శుభ పరిణామమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ యూత్(స్పిక్‌మాకే) పదో అంతర్జాతీయ సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. గతంలో ఢిల్లీ, ఖర్గ్‌పూర్, నాగ్‌పూర్‌లో నిర్వహించిన స్పిక్‌మాకే తాను సమ్మేళనాలకు హాజరైనట్లు తెలిపారు. త్రిపురలో స్పిక్ మాకే కార్యక్రమాలకు హాజరైనట్లు తెలిపారు. త్రిపురలో మహారాజుల పాలనలో హిందుస్తానీ సంగీతం ప్రజాదరణ పొందినట్లు తెలిపారు. ఆ తర్వాత త్రిపురలో హిందుస్తానీ, కర్ణాటక సంగీత కళా ప్రదర్శనలను నిర్వహించేందుకు ప్రయత్నం జరిగినట్లు చెప్పారు. స్పిక్‌మాకే భారతీయ కళలు, కళారూపాలు, సంస్కృతిని రక్షించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్రిపుర నృత్య రూపకం హోజాగిరి సంరక్షించడంలో స్పిక్‌మాకే కృషి అభినందనీయం అన్నారు. భారతీయ సాంస్కృతిక, కళా వారసత్వ రక్షణకు ఉద్యమం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అంతరించిపోతున్న కళలు, కళారూపాలను రక్షించి భారతీయ ఆత్మను చైతన్యం చేస్తున్నట్లు చెప్పారు. ధర్మం అంటే ఆలోచన విధానమని, మతం అంటే పూజించే విధానమని, ఈ రెండింటిని కలిపి గందరగోళానికి గురి కావద్దని ప్రజలను గవర్నర్ కోరారు. గురువులు శిష్య పరంపర కొనసాగడం ఆనందంగా ఉందని గవర్నర్ పేర్కొన్నారు. మొదటిరోజు కూచిపూడి కళాకారులు రాజ, రాధారెడ్డి ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. వయోలిన్ విద్యాంసులు డా.ఎన్.రాజమ్ ప్రదర్శన ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో ఐఐటీ డైరక్టర్ బీఎస్ మూర్తి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ పరితోష్ పంకజ్ , స్పిక్‌మాకే వ్యవస్థాపకులు డా.కిరణ్ సేథ్, స్పిక్‌మాకే ప్రతినిధులు మహేంద్రకుమార్, రాధామోహన్ తివారి, కోన లక్ష్మి, కళాపూర్ణ, ఐఐటీహెచ్ ప్రొఫెసర్ మధుసూదన్, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మేళానికి హాజరైన ఆహూతులు

అర్జీలు వేగంగా పరిష్కరించాలి

సంగారెడ్డిలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, మే 26 : సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 69 అర్జీలు అందాయి. కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అర్జీలు స్వీకరించారు. అర్జీలు వేగంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దరఖాస్తు పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించి సకాలంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

మెదక్, మే 26 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేశ్ ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులు. భూ సమస్యలు 19, పింఛన్లు 3, డబుల్ బెడ్‌రూం ఇండ్లు 1, ఇతర సమస్యలు- 29, మొత్తం దరఖాస్తులు 52 స్వీకరించినట్లు పేర్కొన్నారు. జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, ఏవో యూనూస్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెదక్ ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

గీతంలో ఎన్‌సీసీ క్యాంప్ ప్రారంభం

33 బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ శిబిరం

క్యాడెట్ల పేర్లను నమోదు చేసుకుంటున్న అధికారులు

పటాన్‌చెరు రూరల్, మే 26 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలో 33 బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్ల సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది.ఆరు వందల మంది క్యాడెట్లకు శిక్షణ ఇవ్వనున్నారు. తొలిరోజు పేర్లు నమోదు చేసుకుని అవగాహన కల్పించారు. ఈనెల 26నుంచి జూన్ 4 వరకు పదిరోజుల పాటు శిక్షణ శిబిరం కొనసాగుతుందని ఎన్‌సీసీ అధికారులు తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు సామాజిక సేవ, జాతీయ ఐక్యత స్ఫూర్తి పెంచుతామని తెలిపారు. డ్రిల్, ఆయుధ శిక్షణ, కాల్పుల్లో నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతుందని వివరించారు. ఎన్‌సీసీ బీ,సీ సర్టిఫికెట్ పరీక్షలకు క్యాడెట్లను సిద్ధం చేస్తామన్నారు. థల్ సైనిక్ క్యాంప్ (టీఎస్సీ-2025), గణతంత్ర దినోత్సవ పెరెడ్ (ఆర్డీసీ-2026) వంటి ప్రతిష్టాత్మక శిబిరాలకు అవగాహన కల్పించడం, అగ్నివీర్, ఇతర సైనిక ప్రవేశ పథకాల ద్వారా కెరీర్‌ను ఎంపిక చేసుకునేలా ప్రేరేపిస్తామని తెలిపారు. 33వ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్, క్యాంప్ కమాండెంట్ కల్నల్ రమేశ్ సరియాల మే 27న కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభిస్తారని వివరించారు. కల్నల్ రమేశ్ నేతృత్వంలో క్యాంప్ కొనసాగుతుందని తెలిపారు.